అమ్మకు కమ్మని భోజనం

- గర్భిణులు, బాలింతలకు ఇంటికే పోషకాహారం
- ఆరోగ్యవంతమైన భావితరాల కోసం వైఎస్సార్ సంపూర్ణ పోషణ, టీహెచ్ఆర్ కిట్‌లు

పెదకాకాని: గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారన్ని అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. గతంలో అంగన్‌వాడీ కేంద్రాల్లోనే భోజనం తయారు చేసి అందించేవారు. అంగన్‌వాడీ సెంటర్‌లకు వచ్చి తినడానికి ఎక్కువ మంది ఆసక్తి కనపరచడం లేదు. సరాసరి కేవలం 60 శాతం మంది మాత్రమే ఈ ఆహారాన్ని తీసుకుంటున్నారని గణాంకాలు ద్వారా గుర్తించారు. గర్భిణులు, బాలింతలు అందరూ ఈ పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశంతో ఇంటికే పోషకాహార కిట్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పెదకాకాని మండలంలో నంబూరు, పెదకాకాని సెక్టార్లలో మొత్తం 445 మంది గర్భిణులు, 342 మంది బాలింతలు ఉన్నారు. వారందరికీ అంగన్‌వాడీ కేంద్రాలలో ఇప్పటి వరకూ అందించిన స్పాట్ ఫీడింగ్‌కు బదులుగా టేక్ హోమ్ రేషన్(టీహెచ్ఆర్) అందిస్తున్నారు. ఈ నెల 2వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభమైంది. పొన్నూరులో స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. అంగన్‌వాడీ కేంద్రాలలో టీహెచ్ఆర్‌తో పాటు వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా పది రకాల సరుకులతో కూడిన కిట్లు అందిస్తున్నారు. ఒక్కో కిట్ కోసం ప్రభుత్వం సుమారు రూ.900 చెల్లిస్తుంది. ఈ టీహెచ్ఆర్ కిట్‌లో మూడు కిలోల బియ్యం, కేజీ కందిపప్పు, అర లీటర్ ఆయిల్, 25 కోడిగుడ్లు, ఐదు లీటర్ల పాలు ఉంటాయి. ఈ ఖర్చును కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 50 శాతం చొప్పున భరిస్తాయి. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అదనంగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా రాగి పిండి రెండు కిలోలు, అటుకులు కిలో, వేరుశనగ చిక్కీ 250 గ్రాములు, ఖర్జూరం 250 గ్రాములు, బెల్లం 250 గ్రాములు చొప్పున ప్రతి నెలా పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే సమకూరుస్తుంది. ఆరోగ్యవంతమైన భావితరాల కోసం గర్భిణులకు, బాలింతలకు పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలను ప్రభుత్వం అందజేస్తుంది.

బిడ్డకు సమృద్ధిగా పోషకాలు..



టేక్ హోమ్ రేషన్ కిట్ వల్ల సమృద్ధిగా శిశువులకు పోషకాలు అందుతాయి. బిడ్డకు కావాల్సిన పోషకాలను అందించగలుగుతాం. పుట్టబోయే బిడ్డపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. పది రకాల సరుకులు నాణ్యంగా ఉన్నాయి.

– దానబోయిన జ్యోతి, బాలింత, పెదకాకాని

నాణ్యమైన సరుకులు..



టేక్ హోమ్ రేషన్ కిట్ల ద్వారా నాకు పౌష్టికాహారం అందుతుంది. ఈ కిట్లలోని సరుకులు బయట మార్కెట్‌లో కొనాలంటే చాలా ఖర్చు అవుతుంది. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం, టీహెచ్ఆర్ కిట్ల ద్వారా నాణ్యమైన సరుకులు అందించారు. ఇటువంటి పోషకాహారం తీసుకోవడం ద్వారా పుట్టబోయే బిడ్డ కూడా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటాడు. ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– తోట మధుబాల, పెదకాకాని

క్లుప్తంగా

శిశువుకు తల్లిపాలు శ్రేయస్కరం



కొమ్మూరు(కాకుమాను): తల్లి పాలే శిశువుకి శ్రేయస్కరమని ఐసీడీఎస్ కాకుమాను సెక్టార్ సూపర్‌వైజర్ కుమారి అన్నారు. మండలంలోని కొమ్మూరు మైనార్టీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లి పాల వారోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కుమారి మాట్లాడుతూ శిశువుకి జన్మనిచ్చిన వెంటనే తల్లి బిడ్డకు ముర్రు పాలు తాగించాలని ఆమె సూచించారు. తల్లి పాలే శిశువుకి శ్రీరామ రక్ష అని ఆమె తెలిపారు. ఈసందర్భంగా తల్లి పాల గురించి వైద్య సిబ్బంది, మహిళా పోలీసులు వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

విజ్ఞాన్ విద్యార్థిని ప్రియాంకకు పీహెచ్‌డీ



చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ సివిల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన విద్యార్థిని ముక్కాల ప్రియాంకకు తమ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందించిందని వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ మంగళవారం తెలిపారు. 'ఎక్స్‌పెరిమెంటల్ ఇన్వెస్టిగేషన్ ఆన్ స్ట్రెంగ్త్, డ్యూరబిలిటీ అండ్ మైక్రో స్ట్రక్చరల్ కారక్టరిస్టిక్స్ ఆఫ్ జియోపాలిమర్ అగ్రిగేట్ బేస్డ్ కాంక్రీట్' అనే అంశంపై ఆమె పరిశోధన చేసిందని తెలిపారు. పీహెచ్‌డీ పొందిన ముక్కాల ప్రియాంకను పలువురు అభినందించారు.

ట్రాఫిక్ పోలీసు స్టేషన్ తనిఖీ



పట్నంబజారు: వెస్ట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌ను జిల్లా ఎస్పీ షేక్ ఆరీఫ్ హఫీజ్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. తొలుత పరిసరాలు పరిశీలించారు. స్టేషన్‌లో ఉన్న ప్రమాద కేసుల వివరాలు, ఇతర రికార్డులపై ఆరా తీశారు. ట్రాఫిక్ పోలీసులు వెస్ట్ పరిధిలో చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్, ఇతర అంశాలను ఎస్పీకి వివరించారు. ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ మాట్లాడుతూ నిత్యం ప్రజలకు ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా బాధ్యతతో విధులు నిర్వహించాలని సూచించారు. అధికారులు, సిబ్బంది ఇబ్బందులు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకు రావాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్పీ బాలసుందరరావు, సీఐ అక్కేశ్వరరావు ఉన్నారు.

మహిళలు అప్రమత్తంగా ఉండాలి



పట్నంబజారు: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తపేట పోలీసు స్టేషన్ ఎస్ఐలు తరంగిణి, మీరజ్ హెచ్చరించారు. రామిరెడ్డితోటలోని మహిళలకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమాజంలో అసాంఘిక కార్యకలాపాలను వీడి జీవితాలను బాగు చేసుకునేలా కష్టపడి పనిచేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ దిశ యాప్ డౌన్‌లోడు చేసుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దేశాభివృద్ధిలో యువత పాత్రపై వ్యాసరచన పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులకు దేశాభివృద్ధిలో యువత పాత్ర అనే అంశంపై వ్యాస రచన పోటీలు మంగళవార నిర్వహించారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నా మట్టి -నా దేశం నినాదంతో భాగంగా పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ మాట్లాడుతూ 76 ఏళ్ల స్వాతంత్య్రాన్ని పురస్కరించుకొని, స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలు స్మరించుకునేందుకు అవకాశంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథక కార్యక్రమ నిర్వహణ అధికారులు డాక్టర్ జీవీ సుధీర్ కుమార్, జయ శైలజ, శ్రావణి, పి. అప్పారావు పాల్గొన్నారు.

ఇష్టంతో కష్టపడి పనిచేస్తే విజయం దరిచేరుతుంది

మేడికొండూరు: ఏరంగంలోనైనా లక్ష్యం దిశగా ఎంత కష్టమైనపని అయినా ఇష్టంతో చేస్తే విజయం దరిచేరుతుందని మాజీ క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు అన్నారు. మండలంలోని మేడికొండూరు, డోకిపర్రు గ్రామాల్లో అంబటి రాయుడు మంగళవారం పర్యటించారు. తొలుత మేడికొండూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సమృద్ధిగా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం హైస్కూల్ క్రీడా మైదానంలో కొద్దిసేపు విద్యార్థులతో క్రికెట్ ఆడారు. అనంతరం డొకిపర్రు గ్రామంలోని ఎంపీయూపీ స్కూలును సందర్శించారు. పలువురు రైతులతో మాట్లాడి వారి పరిస్థితులను తెలుసుకున్నారు. డోకిపర్రు సమీపంలోని యూనివర్సల్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ విద్యార్థులతో కొద్దిసేపు క్రి కెట్ ఆడి ఉత్సాహపర్చాడు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మానవ జీవితంలో విద్యార్థి దశ క్రియాశీలకమని గుర్తుచేశారు. విద్యార్థి దశలో సమయం వృథాచేయకుండా సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. విద్యారంగంతోపాటు తమకు ఇష్టమైన క్రీడలో కూడా రాణించాలని అన్నారు.

మోదుకూరి జాన్సన్‌కు నివాళి



జాన్సన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నెహ్రూనగర్: మోదుకూరి జాన్సన్ రచనలు ఆదర్శనీయమని మేడ్ రాష్ట్ర అధ్యక్షుడు మురికిపూడి దేవపాల్ పేర్కొన్నారు. ఓల్డ్ క్లబ్ రోడ్డులోని మేడ్(మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత్ ఎంప్లాయీస్) రాష్ట్ర కార్యాలయంలో మోదుకూరి జాన్సన్ జయంతి ఘనంగా నిర్వహించారు. తొలుత మోదుకూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ 1936 ఆగస్టు 8వ తేదీ తెనాలి సమీపంలోని కొలకలూరులో జన్మించిన జాన్సన్ మొదటి నుంచి నటనపై ఆసక్తితో అనేక నాటకాలలో నాటి కాలలో వివిధ పాత్రలలో రాణించిన అసమాన ప్రతిభా సంపన్నుడు జాన్సన్ అని కొనియాడారు.

ఎంతో సజీవమైన అజరామరామైన మాటలు, పాటలు, రచనలు చేసిన వ్యక్తిగా చెప్పారు. దేశోద్ధారకుడులో స్వాగతం 'దొర సుస్వాగతం' కరుణామయుడులో కదిలింది కరుణ రథం' పాడి పంటలు చిత్రంలో 'మన జన్మభూమి బంగారు భూమి' లాంటి చిరస్మరణీయ గేయాలు రచించిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో డెమోక్రాటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు కొల్లిపర ఆనందరావు, ఈహెచ్ఎస్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రావెల నల్లయ్య, ఎలక్ట్రికల్ ఎంప్లాయీస్ అసోషియేషన్ నాయకులు కందుకూరి మరియదాసు, కంచర్ల శ్యామ్, పేరకలపూడి రమేష్, చాట్ల గురవయ్య , వీరయ్యచౌదరి, పేరుపోగు కమలయ్య, జన మాల శ్యామ్, షేక్ మస్తాన్ వలి, రెడ్డిబోయిన డేవిడ్, గర్నెపూడి ఆదెయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ రిజర్వు స్థలాల అభివృద్ధికి చర్యలు


కమిషనర్ కీర్తి చేకూరి



అధికారులతో చర్చిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఓపెన్, రిజర్వ్ స్థలాలను స్థానిక ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయనున్నామని, ఎక్కడైనా ఆక్రమణలు ఉంటే వాటిని తొలగించడానికి పట్టణ ప్రణాళికాధికారులు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి అధికారులకు ఆదేశించారు. మంగళవారం గుజ్జనగుండ్ల, బాపయ్య నగర్, ఇన్నర్ రింగ్ రోడ్, రెడ్డిపాలెం, గోరంట్లలోని పలు ప్రాంతాల్లో నగరపాలక సంస్థకు చెందిన రిజర్వ్, ఓపెన్ స్థలాలను పరిశీలించి అభివృద్ధి పనులపై ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళికాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో నగరపాలక సంస్థకు చెందిన ఖాళీ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా స్థానికులకు ఆహ్లాదాన్ని అందించే పార్కులు, ఆట స్థలాలుగా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నగరపాలక సంస్థ అభివృద్ధి చేసిన పార్కుల నిర్వహణకు స్థానికులను భాగస్వామ్యం చేస్తామన్నారు. పార్కుల్లో ప్రధానంగా వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, పిల్లల ఆట వస్తువులు, పచ్చదనం పెంపు ఉండాలని, గుర్తించిన పార్కుల్లో బాస్కెట్ బాల్, షటిల్, బ్యాడ్మింటన్ కోర్టుల ఏర్పాటుకు కూడా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థకు చెందిన స్థలాల గుర్తింపు, ఆక్రమణల తొలగింపునకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సిటీ ప్లానర్‌కి సూచించారు. పర్యటనలో సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎస్ఈ భాస్కర్, ఈఈ సుందర రామిరెడ్డి, డెప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య, ఏడీహెచ్ రామారావు, ఏసీపీ అజయ్ కుమార్, డీఈఈ రఫిక్, శివకుమార్ పాల్గొన్నారు.

లయన్ వెంకటసుబ్బయ్యకు అవార్డుల పంట



వి.డి.శివప్రసాద్ నుంచి వెంకటసుబ్బయ్య అవార్డు లను అందుకున్నారు. కార్యక్రమంలో జిల్లా పూర్వ గవర్నర్ కె.విజయ చంద్, పి.గోపీచంద్ పాల్గొన్నారు.

పాత గుంటూరు: 2021– 22, 23 సంవత్సరాలకు లయన్స్ క్లబ్ ద్వారా విశేష సేవలు అందించిన లయన్స్ క్లబ్ ఆఫ్ పట్టాభిపురం సీనియర్ నాయకులు వి.వెంకట సుబ్బయ్య ప్రతిష్టాత్మక జిల్లా గవర్నర్ అప్రిసియేషన్ అవార్డు, గవర్నర్ ఎక్సలెన్సీ అవార్డులను కైవసం చేసుకున్నారు. మంగళవారం అమరావతి రోడ్డులోని బి.వి.ఆర్ సమావేశ మందిరంలో లయన్స్ క్లబ్స్ జిల్లా 316 హెచ్ అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ కె.మన్మథరావు, ఎండార్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ పి. సుభాష్ బాబు, ఏరియా లీడర్ డాక్టర్ వి.ఎస్.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

పట్నంబజారు: విద్యార్థి దశ నుంచే ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని గుంటూరు వెస్ట్ ట్రాఫిక్ సీఐ పి.అక్కేశ్వరరావు చెప్పారు. మంగళవారం లక్ష్మీపురంలోని శ్రీచైతన్య పాఠశాలలో ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనల వివరించే పోస్టర్లు ఆవిష్కరించారు. సీఐ అక్కేశ్వరరావు మాట్లాడుతూ పూర్తి స్థాయిలో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే రోడ్డు ప్రమాదాలు అరికట్టవచ్చు అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, ఇస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధ్యాయులు ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు.

12న కళాపీఠం గోల్డెన్ జూబ్లీ వేడుకలు

పాత గుంటూరు: కళాపీఠం గోల్డెన్ జూబ్లీ వేడుకలు ఈనెల 12, 13 తేదీలలో నిర్వహించనున్నట్లు కళాపీఠం అధ్యక్షుడు ఎస్‌వీఎస్ లక్ష్మీనారాయణ తెలిపారు. అమరావతి రోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాల నిర్వహించనున్న వేడుకల్లో చిత్రకళపై వర్క్‌షాపు, ఆర్ట్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రదర్శనలు ఇచ్చేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి 50 మంది ప్రముఖ చిత్ర కళాకారులను కళాపీఠం ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. 12న ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సభలో ముఖ్య అతిథిగా హైకోర్టు జడ్జి జస్టిస్ యు.దుర్గా ప్రసాద్ పాల్గొంటారని చెప్పారు.

నగరంలో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పర్యటన

నెహ్రూనగర్: స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం మంగళవారం నగరంలో పర్యటించింది. ఆరుగురు సభ్యుల బృందం పట్టాభిపురం, శ్యామలానగర్, బసవతారకరామానగర్, కొరిటెపాడు, పలకలూరు తదితర ప్రాంతాల్లో డోర్ టూ డోర్ తిరిగి ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించారు. తడి, పొడి చెత్త విధానం, స్వచ్ఛ సర్వేక్షన్ గురించి తెలుసా, సెప్టిక్ ట్యాంక్ నిండితే మిషన్ ద్వారా తీయిస్తున్నారా, మాన్యువల్‌గా తీస్తున్నారా? లాంటి ప్రశ్నలకు ప్రజల నుంచి సమాధానాలు తెలుసుకున్నారు. ఈ రిపోర్టును బట్టి గుంటూరు నగరానికి ర్యాంకును నిర్దేశించనున్నారు.

విద్యార్థులు సేవా దృక్పథం కలిగి ఉండాలి



వృద్ధాశ్రమంలో నిత్యావసర సరుకులు అందజేస్తున్న విద్యార్థులు

గుంటూరు రూరల్: విద్యార్థులు చిన్ననాటినుంచి సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం లాం నందున్న కళాశాల టెక్ వింగ్స్ అసోసియేషన్ విద్యార్థుల ఆధ్వర్యంలో అగతవరప్పాడు, నగరంలోని సెయింట్ పాప్టినాస్ బాల సదన్ వృద్ధాశ్రమంలో 20 మంది వయోవృద్ధులు, బాలబాలికలకు రోజువారి సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు నెలకు సరిపడా రోజువారి సరుకులు బియ్యం, కందిపప్పు, నూనె, తదితరాలను అందజేశారన్నారు. డాక్టర్ ఎ.బాలాజీ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో కన్నబిడ్డలు, తల్లిదండ్రులను పట్టించుకోని తరుణంలో ఆయా వయోవృద్ధులు, బాల బాలికలకు తమ విద్యార్థులు సహాయాన్ని అందించటం అభినందనీయమన్నారు. సేవా కార్యక్రమాన్ని నిర్వహించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ వైవీ ఆంజనేయులు అభినందించారు.

13న జేవీవీ ఆధ్వర్యంలో పోటీలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సత్యనారాయణ ప్రసాద్, బి.ప్రసాద్, సాయికుమార్, రమేష్

గుంటూరు ఎడ్యుకేషన్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జనవిజ్ఞాన వేదిక, స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్ ఆధ్వర్యంలో ఈనెల 13న పాఠశాల స్థాయి విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు జేవీవీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఏ సత్యనారాయణ ప్రసాద్ తెలిపారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ హాల్లో పోటీలకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్లో వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్, క్విజ్ పోటీలను 5,6,7 తరగతుల విద్యార్థులకు జూనియర్, 8,9,10 తరగతుల విద్యార్థులకు సీనియర్ విభాగంలో పోటీలు జరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ప్రసాద్, స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్ ప్రతినిధులు కె. సాయికుమార్, దేవసూర్య, పవన్, మణి, భార్గవ్, ఆదిత్య, వినయ్, జేవీవీ ప్రతినిధులు టి.జాన్‌బాబు, టీఆర్ రమేష్, బి.శంకర్‌సింగ్, బి.ప్రతాప్‌సింగ్, డి.ప్రవీణ్, హనుమంతరాజు పాల్గొన్నారు.

అన్నివర్గాలకు అండగా ప్రభుత్వం



మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

- ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- చింతలపూడిలో రెండో రోజు గడపగడపకు మన ప్రభుత్వం

చేబ్రోలు: అన్ని వర్గాల ప్రజలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని పొన్నూరు శాసన సభ్యుడు కిలారి వెంకట రోశయ్య అన్నారు. పొన్నూరు మండలం చింతలపూడి గ్రామంలో మంగళవారం రెండో రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. పార్టీ నాయకులు, అభిమానులు, యువకులు ఎమ్మెల్యే కిలారికి ఘన స్వాగతం పలికారు. చింతలపూడి గ్రామంలో కిలారి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను తెలియజేస్తూ బుక్‌లెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. నాడు – నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ పరిశీలకులు అన్నాబత్తుని సదాశివరావు, ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, ఎంపీపీ భవనం పద్మలీల, ఎంపీడీఓ ఎ.శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు దాసరి నారాయణరావు, మారుపూడి వెంకట్, రావిపాటి బోస్, చిగురుపాటి సుబ్బారావు, సోమన్న దొర, మెరుగుల శ్రీనివాసరావు, బండి సాయి, పెరికల కృష్ణమోహన్, బొద్దులూరి రంగారావు, షేక్ మహమ్మద్, షేక్ మాము పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను నియంత్రించాలి

తాడేపల్లిరూరల్: మద్యం, మత్తు పదార్థాలను నియంత్రించాలని నిపుణులతో కమిషన్ ఏర్పా టు చేయాలని ఐద్వా నేతలు డిమాండ్ చేశారు. హింసపై మహిళల పోరుయాత్రలో భాగంగా మంగళవారం తాడేపల్లి ముగ్గు రోడ్డుకు చేరుకున్న సందర్భంగా ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి మాట్లాడుతూ మహిళలపై, చిన్నారులపై హింస రోజురోజుకూ పెరుగుతోందని, నిరోధించాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణితో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా రెజ్లర్లపై ఢిల్లీలో జరిగిన సంఘటన మరవక ముందే మణిపూర్‌లో కుకి తెగ కు చెందిన గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించడం సిగ్గుచేటన్నారు. మహిళలపై జరుగుతున్న నేరాల అధ్యయనానికి నిపుణులతో కమిటీ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.శ్రీనివాసకుమారి, జిల్లా అధ్యక్షులు కె.పద్మ, పట్టణ అధ్యక్షురాలు డి. విజయలక్ష్మి, జిల్లా కార్యదర్శి అరుణ ఉన్నారు.

అంతర పంటలసాగు తప్పనిసరి

ఫిరంగిపురం: ప్రధాన పంటలతోపాటు అంతర పంటలసాగు తప్పనిసరిగా వేయాలని రాష్ట్ర రైతు సాధికారత సంస్థ జిల్లా డీపీఎం రాజకుమారి అన్నారు. మండలంలోని అమీనాబాద్ గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న అచార్య వెంకట్రామయ్య ప్రకృతి యోగాసం జీవని ఆరోగ్యసదనం వారి ఆశ్రమంలో ఏటీఎం మోడల్స్ బెడ్స్ ఏర్పాటు చేస్తున్నారు. వాటిని మంగళవారం డీపీఎం రాజకుమారి, ఎస్ఆర్పీ వెంకట్రావునాయుడులు పరిశీలించారు. వెంకట్రావు నాయుడు మాట్లాడుతూ రైతులందరూ తక్కువ పెట్టుబడితో రసాయనాలు వాడకుండా ఏటీఎం మోడల్స్‌లో భాగంగా ప్రధాన పంటతోపాటు అంతర పంటలసాగు వేసుకోవాలని సూచించారు. అంతరపంటలుగా ముల్లంగి, బీట్రూట్, కేరట్, గోరు చిక్కుడు, చిక్కుడు, బీన్స్, అలచందలు, మొక్కజొన్న, ఆకుకూరలు పండించుకోవాలని సూచించారు. సత్యసాయి జిల్లా మెంటార్ భార్గవ్, ఇ.వెంకటేశ్వర్లు, సీహెచ్ రాఘవేంద్ర, రైతులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో విత్తనాలు

పెదకాకాని: రైతు భరోసా కేంద్రంలో పియూ–31 రకం మినుము విత్తనాలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయని వెనిగండ్ల విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ పత్తి పవన్‌కుమార్ మంగళవారం తెలిపారు. ప్రస్తుతం ఆర్‌బీకేలో రైతుల కోసం ఎరువులు సిద్ధంగా ఉన్నాయన్నారు. కిలో విత్తనాలు రూ.84 చొప్పున అమ్మడం జరుగుతుందన్నారు. మినుము సాగు చేసే రైతులు రైతు భరోసా కేంద్రంలో ఉన్న మినుము విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని వీఏఏ అన్నారు.

అక్రమ మద్యం కలిగి ఉన్న వ్యక్తులపై కేసు

పెదకాకాని: నిబంధనలకు విరుద్ధంగా మద్యం బాటిళ్లు కలిగిన ఉన్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు పోలీసులు నిర్వహించిన తనిఖీలలో అక్రమంగా మద్యం తరలిస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. వెనిగండ్లకు చెందిన కృష్ణ వద్ద నుంచి 20 క్వార్టర్(180 ఎంఎల్) సీసాలు, పెదకాకానికి చెందిన ప్రసాద్, శ్యాంల వద్ద నుంచి 11 క్వార్టర్ సీసాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు మంగళవారం పెదకాకాని సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.